కేసీఆర్‌తో బీఆర్ఎస్‌వీ నాయకుడు అఖిల్

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్‌వీ నాయకుడు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 9: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను బీఆర్ఎస్‌వీ నాయకుడు అఖిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ అందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ ప్రజల మధ్య ఉంటూ ప్రజలకు అండగా ఉండాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారని అఖిల్ తెలిపాడు.

సామాజిక సర్వేతోనే బలహీన వర్గాల అభివృద్ధి

ఎన్యూమరేటర్లతో మంత్రి దామోదర

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 9: సామాజిక సర్వేతోనే బలహీన వర్గాల అభివృద్ధి జరుగుతుందని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వే ప్రక్రియలో భాగంగా శనివారం సంగారెడ్డి విద్యానగర్ కాలనీ వార్డు నంబరు 32లో మంత్రి దామోదర రాజనర్సింహ కుటుంబ వివరాలను ఎన్యూమరేటర్ నమోదు చేశారు. మంత్రి స్వయంగా తన కుటుంబ వివరాలు అందించారు. ప్రజలు ఎలాంటి అపోహలు లేకుండా పూర్తి సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వే వివరాలతో ప్రభుత్వ విధానాల రూపకల్పన, కొత్త పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం సులభతరమవుతుందన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక

సుమతి

కొండాపూర్, నవంబర్ 9: జాతీయ స్థాయి యోగా పోటీలకు మండలంలోని గంగారం గ్రామానికి చెందిన సుమతి ఎంపికైంది. జిల్లా పరిషత్ గంగారం ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న సుమతి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పండరి నాయక్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో వరంగల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైందని తెలిపారు. ఈ నెల 17 నుంచి డిసెంబర్ 2 వరకు మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో సరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. తమ గ్రామ విద్యార్థి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక కావడంతో గ్రామస్తులు నరసింహారెడ్డి, అంజిరెడ్డి, సర్సింహులు, భాస్కర్, శేఖర్, రవి, శిరాజ్‌గౌడ్, అంజాగౌడ్, ప్రభుస్వామి విద్యార్థినిని అభినందించారు.

నేడు కంటి వైద్య శిబిరం

జహీరాబాద్, నవంబర్ 9: జహీరాబాద్ పట్టణంలోని శ్రీభగవాన్ సత్య సాయి మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మందిర కమిటీ సభ్యులు పేర్కొన్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ కంటి దవాఖాన ఆధ్వర్యంలో స్థానిక సత్య సాయి మందిర ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి జబ్బులతో బాధపడుతున్న వారికి వైద్యాధికారులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

జహీరాబాద్, నవంబర్ 9: న్యాల్‌కల్ మండలం మల్గి గ్రామ శివారులోని కంకర క్వారీలో శనివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు హద్నూర్ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామ శివారులోని కంకర క్వారీలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఉదయం గ్రామస్తులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని సిబ్బందితో వచ్చి పరిశీలించారు. క్వారీ గుంత లోతుగా ఉండడంతో మత్స్యకారులను రప్పించి మృతదేహాన్ని బయటకు తీయించారు. కొద్ది రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని, కేవలం అస్థిపంజరం మాత్రమే ఉండడం, ఎలాంటి ఆనవాళ్లు దొరకలేదు. జహీరాబాద్ నుంచి వైద్యాధికారిని రప్పించి ఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి అక్కడే ఖననం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్‌ను బలోపేతం చేయాలి

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

బీఆర్ఎస్ మొగుడంపల్లి మండల అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

జహీరాబాద్, నవంబర్ 9: బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాస గృహంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ శివకుమార్, జహీరాబాద్, మొగుడంపల్లి మండలాలకు చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు కలిశారు. ఇటీవల బీఆర్ఎస్ మొగుడంపల్లి మండల అధ్యక్షుడిగా సంజీవ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును సంజీవ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కవడంతో శాలువా కప్పి పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ఎండగడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి, మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సంఖ్యలో బీఆర్ఎస్ మద్దతుదారులు గెలిచేలా ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పెంటారెడ్డి, బీఆర్ఎస్ జహీరాబాద్, కోహీర్ మండలాల అధ్యక్షులు తట్టు నారాయణ, నర్సింహులు, నాయకులు రాజశేఖర్, పర్వేజ్, చిన్నారెడ్డి, కరుణ్‌రాజ్, మోహన్‌రెడ్డి, హీర రాథోడ్, ఓంకార్‌రెడ్డి, నయీం, రాథోడ్ బీంరావు, సంజు పవర్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఘన స్వాగతం

కొల్చారం రైతుగర్జన సభకు వెళ్తున్న హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నేతలు

గుమ్మడిదల, నవంబర్ 9: నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుగర్జన సభకు వెళ్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు గుమ్మడిదల మండల బీఆర్ఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. శనివారం గుమ్మడిదల మీదుగా కొల్చారం వెళ్తున్న క్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. జైతెలంగాణ, జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం భారీ కాన్వయ్‌తో మండల నాయకులు కొల్చారం తరలివెళ్లారు. మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి, నాయకులు ఆలేటి శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, మంద భాస్కర్‌రెడ్డి, గౌరీశంకర్‌గౌడ్, జిన్నారం వెంకటేశంగౌడ్, నక్క వెంకటేశ్‌గౌడ్, మడపతి గణేశ్, వినోద్‌గౌడ్, ఆకులనవీన్, రాజేశ్, ఆంజనేయులు, గటాటిరమేశ్ పాల్గొన్నారు. కొల్చారం రైతుగర్జన సభ ముగించుకుని తిరుగు ప్రయాణంలో చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి స్వగృహంలో తేనేటి విందులో పాల్గొన్నారు. మండల నాయకులు, కార్యకర్తలతో ఫొటోలు దిగారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

‘నల్లవాగు’లో చేప పిల్లలు విడుదల

నల్లవాగులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, తదితరులు

సిర్గాపూర్, నవంబర్ 9: నల్లవాగు మధ్యతరహా ప్రాజెక్టులో మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, రాష్ట్ర మత్స్య సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్ ఐదు లక్షల చేప పిల్లలను వదిలారు. అనంతరం స్థానిక ప్రాజెక్టు గెస్ట్‌హౌజ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముదిరాజ్ జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి చెరువుల్లో ఉచితంగా చేపపిల్లల విడుదల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కుల వృత్తుల వారు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలోమత్స్యశాఖ అధికారులు నర్సింహారావు, డీఈఈ పవన్‌కుమార్, తహసీల్దార్ ఉమాశంకర్, ఎంపీడీవో మల్సూర్‌నాయక్, నాయకులు, కృష్ణమూర్తి, రాంరెడ్డి, బాల్‌రెడ్డి, సంగారెడ్డి, రవిపటేల్, జ్ఞానేశ్వర్, మోహన్‌రెడ్డి, మత్స్యకార్మికులు, ముదిరాజ్ సంఘం సభ్యులు ఉన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి

జలమండలి ఎండీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు, నవంబర్ 9: నియోజకవర్గం పరిధిలోని భారతీనగర్, రామచంద్రపురం, పటాన్‌చెరు డివిజన్ల పరిధిలో జలమండలి ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రూ.13 కోట్ల 20 లక్షలు నిధులు కేటాయించాలని ఆ శాఖ ఎండీ అశోక్‌రెడ్డిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులపై చర్చించారు. బల్దియా పరిధిలో నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలతోపాటు, పాత కాలనీల్లో అంతర్గత మురుగునీటి కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా నిధులు కేటాయించాలని కోరారు. గతంలో జలమండలికి కేటాయించిన ఆర్‌హెచ్‌సీ ప్రాంతాన్ని స్థానిక అవసరాల కోసం జీహెచ్ఎంసీకి కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎండీ త్వరలోనే నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

బీసీ విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడిగా సాయిభాషా

సాయి భాషాకు నియామకపత్రం అందజేస్తున్న ఆర్ కృష్ణయ్య

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 9: బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సాయి భాషాను నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య నియామకపత్రం అందజేశారు. సంగారెడ్డికి చెందిన సాయి భాషాకు శనివారం హైదరాబాద్‌లో ఆయన నియామకపత్రం అందజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్ష పదవితోపాటు సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల ఇన్‌చార్జిగా నియమిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సాయి భాషా మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బీసీ విద్యార్థి సంఘం నాయకులు, పట్నం మాణిక్యం ఫౌండేషన్ సభ్యులు శ్రీకాంత్ టెన్న, రోహిత్ గౌడ్, సాయికుమార్, శ్యామ్ పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర రూ.10 వేలు ఇవ్వాలి

మాట్లాడుతున్న సీపీఎం నేత జయరాజ్

సదాశివపేట, నవంబర్ 9: పత్తికి రూ.10 వేలు మద్దతు ధర కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. పంటలకు మద్దతు ధర కల్పించడంతో ప్రభుత్వాలు విఫలయ్యాయని ఆరోపించారు. ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ప్రవీణ్‌కుమార్, నాయకులు అనిల్, ఎండీ ఖయ్యూం, ఆంజనేయులు, మల్లేశం, శ్రీనివాస్, భూషణం, ఏసేబు, మహేశ్ పాల్గొన్నారు.

గాలికుంటు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి

సంగారెడ్డ కలెక్టరేట్/గుమ్మడిదల, నవంబర్ 9: జిల్లాలో కొనసాగుతున్న గాలికుంటు టీకా కార్యక్రమాన్ని శనివారం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ అరుణశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గుమ్మడిదల, జిన్నారం, అమీన్‌పూర్ మండలాల్లోని అన్నారం, వావిలాల, ఐలాపూర్ తదితర గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. తనిఖీలో భాగంగా టీకా శీతోష్ణస్థితి, టీకా వేసిన పశువులకు చెవి ట్యాగ్ వేయడం, భారత పశుధాన్ యాప్‌లో నమోదు చేయడంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువుల్లో గాలికుంటు రహిత రాష్ట్రంగా చేసేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి, ఏడీలు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి

కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కోహీర్, నవంబర్ 9: సనాతన ధర్మాన్ని ముందుకు తీసుకుపోవాలని జిల్లా బ్రాహ్మణ సంఘం కార్యదర్శి కిషన్‌రావుభక్షి, ఉపాధ్యక్షుడు బాపురావు జోషీ అన్నారు. శనివారం మండలంలోని కవేలి మహాలింగ సంగమేశ్వరాలయ ఆవరణలో జహీరాబాద్ డివిజన్ బ్రహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్తిక వన భోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని శివలింగానికి అభిషేకం చేశారు. అనంతరం పంచ వృక్షాల వద్ద కార్తిక దీపాలను వెలిగించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సుధాకర్‌రావు, కార్యదర్శి శ్రీనివాస్‌జోషి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సంధ్యా కులకర్ణి, ఉపాధ్యక్షుడు శైలజాగురునాథ్ జోషి, నీరజాజోషీ, మందాకిని జోషి, డివిజన్ కార్యదర్శి ఆర్యరాధ, అనుపమ, సురేశ్ కులకర్ణి, శంకర్‌రావు కులకర్ణి, రఘురామ్, అక్షయ్ దేశ్‌పాండే పాల్గొన్నారు. మండలంలోని బడంపేట రాచన్నస్వామి ఆలయంలో భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు.

పెట్రోల్ పోసుకొని మహిళ హల్‌చల్

రామచంద్రాపురం, నవంబర్ 9: భారతీనగర్ డివిజన్‌లోని ఎల్ఐజీలో ఓ ఇంటి వివాదంలో మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకొని హల్‌చల్ చేసింది. వివరాల్లోకి వెళ్తే.. ఎల్ఐజీలోని ఇంటి నంబర్ 210కి సంబంధించి యజమాని చాణక్య రెండేండ్ల క్రితం తన ఇంటిని అనంతపూర్‌కు చెందిన వారికి రిజిస్ట్రేషన్ చేశాడు. తన ఇంటిని తనకు తిరిగి ఇవ్వాలని అతను ప్రస్తుత యజమానిని అడిగాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య నాలుగు రోజులుగా వివాదం జరుగుతున్నది. ఇరువర్గాల నుంచి పెద్ద మనుషులు ఈ విషయంపై మాట్లాడుతున్నారు. ఆ ఇంటిలో కిరాయికి ఉంటున్న వ్యక్తి ఇంటిని ఖాళీ చేయడంతో ఇంటికి తాళం వేశారు. శుక్రవారం రాత్రి చాణక్య ఇంటికి వెళ్లి తాళం పగులగొట్టి గొడవ చేశాడు. దీంతో ఇంటి యజమాని శనివారం జేసీబీని తెచ్చి ఇంటికి కూల్చి వేస్తుంటే చాణక్య భార్యతో వచ్చి ఇంటి యజమానితో గొడవకు దిగి ఆమె ఒంటిపై పెట్రోల్ పోసుకొని హల్‌చల్ చేసింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి ఇంటి కూల్చివేతను అడ్డుకొని ఇరు వర్గాలను పోలీసు స్టేషన్‌కు పిలిచారు. డాక్యుమెంట్స్‌ని పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ తెలిపారు.

సందడిగా సదర్

గుమ్మడిదల, నవంబర్ 9: మండలంలోని బొంతపల్లిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి నిర్వహించిన ఈ ఉత్సవాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆలేటి నవీనాశ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సురభి నాగేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. దున్నపోతుల విన్యాసాలు అబ్బురపరిచాయి. అంతకుముందు శ్రీకృష్ణుడికి పూజలు చేశారు.

ఓటర్ల నమోదుకు స్పెషల్ క్యాంపెయిన్

ఓటు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 9: జిల్లాలో ఓటర్ల నమోదు ప్రక్రియను ప్రోత్సహించేందుకు ఈ నెల 10న ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపెయిన్ నిర్వహించనున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. శనివారం సంగారెడ్డి మండల పరిధిలోని హనుమాన్ నగర్, కొత్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన ప్రతి పౌరుడు విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఫారం 6, 7, 8కు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్త ఓటర్ల పేర్లు నమోదు చేయడంతో పాటు మరణించిన వారి పేర్లు, రెండుసార్లు నమోదైన ఓటర్ల పేర్లను తొలగించాలని ఆదేశించారు. ఆదివారం కూడా బీఎల్‌వోలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, బీఎల్‌వోలు రజిత, నర్సమ్మ, పార్వతమ్మ పాల్గొన్నారు.

రెండో పెండ్లి చేసుకున్నాడని దాడి

మామ మృతి, చికిత్స పొందుతున్న భర్త

రాయికోడ్, నవంబర్ 9: తనను కాదని రెండో పెండ్లి చేసుకొని కాపురం చేస్తున్న భర్తపై భార్య కక్ష గట్టింది. తన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి చేసిన దాడిలో మామ మృతి చెందగా భర్త గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన రాయికోడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇందూరు గ్రామానికి చెందిన నాగారం పెంటయ్య(70) పెద్ద కొడుకు సంగమేశ్వర్, హస్నాబాద్‌కు చెందిన మహాలక్ష్మి దంపతులు. వీరికి 15 ఏండ్ల క్రితం వివాహం జరుగగా 2016లో వీరి మధ్య జరిగిన గొడవలతో విడిపోయారు. వీరికి ఇద్దరు పిల్లలు భానుప్రసాద్, వైష్ణవి ఉన్నారు. ఆ సమయంలో సంగమేశ్వర్‌పై గృహహింస కేసు నమోదైంది. ఇద్దరు పిల్లలను సంగమేశ్వర్ తన దగ్గరే ఉంచుకున్నాడు. భార్య కాపురానికి రావడం లేదని రెండో పెండ్లి చేసుకున్నాడు. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అక్టోబర్ 30న రాయికోడ్ నుంచి ఇందూర్‌కు ఆటోలో సంగమేశ్వర్, తండ్రి పెంటయ్య, పిల్లలతో కలిసి ఆటోలో వెళ్తున్నారని సమాచారం తెలుసుకున్న మహాలక్ష్మి తన తల్లిగారి ఊరైన హస్నాబాద్ నుంచి తల్లి సత్తమ్మ, అన్నదమ్ములు మాణిక్, లక్ష్మీనారాయణ, వీరి సమీప బంధువులు మోటికా గ్రామానికి చెందిన మల్లయ్య, విఠల్‌తో కలిసి బండరాళ్లు, ఇనుపరాడ్లతో దాడి చేసింది. ఈ దాడిలో పెంటయ్యకు తీవ్ర గాయాలు కాగా గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ విషమించి ఈ నెల 4న మృతి చెందాడు. భర్త సంగమేశ్వర్ గాంధీలోనే చికిత్స పొందుతున్నాడు. సంగమేశ్వర్ ఫిర్యాదు మేరకు శనివారం మహాలక్ష్మి, ఎలావంటి సత్తమ్మ, మాణిక్, లక్ష్మీనారాయణను అరెస్ట్ చేశారు. మల్లయ్య, విఠల్ పరారీలో ఉన్నారు. వారి నుంచి రెండు బైక్‌లు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్

పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు చెల్లించాలి

జహీరాబాద్, నవంబర్ 9: జహీరాబాద్ మున్సిపల్‌లో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ జహీరాబాద్ పట్టణ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కార్యాలయ అవరణలో సీఐటీయూ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనతో అధికారం చేపట్టిన ప్రభుత్వ మున్సిపల్‌లో కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడంపై మండిపడ్డారు. సంబంధిత మున్సిపల్ శాఖాధికారులు కార్మికులకు న్యాయపరంగా రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ బిల్లులను చెల్లించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకొని కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ బిల్లులను వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో కార్మికుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్, బీఆర్ఎస్ నాయకులు బండి మోహన్, రాకేశ్, మహ్మద్ అలీ, శివప్ప, గణేశ్, వహిద్, శ్రీకాంత్, నగేశ్, కార్మిక సంఘం నాయకులు కామయ్య, యశోదమ్మ, మోహన్, చంటీ, కాంతమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మాట్లాడుతున్న జడ్జి మంథని శ్రీధర్

సిర్గాపూర్, నవంబర్ 9: పాఠశాలలో విద్యార్థులు విద్యాభ్యాసంతోపాటు చట్టాల హక్కులు, వాటి బాధ్యతపై అవగాహన కలిగి ఉండాలని నారాయణఖేడ్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ మంథని శ్రీధర్ అన్నారు. శనివారం మండలంలోని నల్లవాగు గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ న్యాయ సేవా దినోత్సవంలో భాగంగా, న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత పౌరులుగా మహోన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. హక్కులు, బాధ్యతలు తెలుసుకున్నప్పుడే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. న్యాయ పరంగా విద్యార్థులకు చదువుకునే ప్రాథమిక హక్కు ఉందని, హక్కుల కోసం శ్రమించాలని చెప్పారు. ఈ మధ్య సెల్‌ఫోన్‌లో సైబర్ నేరగాళ్ల మోసాలు పెరుగుతున్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. లీగల్ లిటరసీలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతయ్య, న్యాయవాదులు భోజిరెడ్డి, మారుతిరెడ్డి, జీవన్, మోహిన్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

కులగణనలో వ్యక్తిగత సమాచారమెందుకు?

సర్వేకు వివరాలందిస్తున్న మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి

గుమ్మడిదల, నవంబర్ 9: కులగణన పేరుతో వ్యక్తిగత సమాచారం సేకరించడం సరైంది కాదని గుమ్మడిదలలో మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి ఆరోపించారు. శనివారం గుమ్మడిదలలో మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి గృహంలో కులగణన సర్వేను మండల ప్రత్యేకాధికారి అఖిలేశ్‌రెడ్డి, ఎంపీడీవో ఉమాదేవి ఎన్యూమరేటర్లతో కలిసి చేపట్టారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ కులగణన చేయాలనుకున్న సర్కారు కేవలం కులం వివరాలు, ఉపకులాల వివరాలు సేకరించాలే తప్ప వ్యక్తిగత ఆస్తి వివరాలు సేకరించడంపై అనుమానాలున్నాయన్నారు. సర్వేలో 75 అంశాలు, 56 ప్రశ్నలతో కులగణన చేయడాన్ని విరమించుకోవాలని కోరారు.

సంక్షేమ పథకాలు ఎత్తేసేందుకే కుల సర్వే

ఝరాసంగం, నవంబర్ 9: కుల గణనలో మీది ఏ రాజకీయ పార్టీ, వాహనాల వివరాలు అడగడం కులగణనకు విరుద్ధంగా ఉందని ఝరాసంగం మండల పరిధిలోని మేదపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పరమేశ్వర్ పటేల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కుల సర్వే పేరు చెప్పి కుటుంబాల ఆస్తి పాస్తుల వివరాలు సేకరించడం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికీ చాలా కుటుంబాలు వేరుగా ఉంటున్నా వారి భూములు, ఇండ్లు వంటి స్థిరాస్తులు ఉమ్మడిగా ఉన్నాయన్నారు. ఉమ్మడి కుటుంబంలో ఒకరు రిజర్వేషన్ ద్వారా ప్రయోజనం పొందితే వారిని ప్రత్యేక కుటుంబంగా పరిగణిస్తారా.. లేక, అందరూ ప్రయోజనం పొందినట్లు భావిస్తారా అని అడిగితే స్పష్టత ఇవ్వడం లేదన్నారు. కుల గణన పేరుతో సంక్షేమ పథకాలలో కోతలు పెట్టేలా కనపడుతున్నారన్నారు. హామీల అమలును పక్కతోవ పట్టించేందుకే కుల సర్వే చేస్తున్నారని దుయ్యబట్టారు.

కప్ప ఖమ్మం జట్టుదే..

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 9: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో జరుగుతున్న అంతర్ జిల్లా అండర్-23 లీగ్ పోటీల్లో ఖమ్మం జట్టు విజయం సాధించింది. టౌర్నమెంట్‌లో భాగంగా శనివారం కొండాపూర్ మండలం చీమలదారి కోనాపూర్‌లో జరిగిన ఫైనల్స్‌లో ఇరు జిల్లాల జట్లు పోటీ పడగా ఆదిలాబాద్‌పై ఖమ్మం జట్టు గెలుపొందింది. ఈ పోటీలో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు నిర్దారిత 50 ఓవర్లకు గాను 336 పరుగులు చేసి 6 వికెట్లు కోల్పోయింది. నారాయణ తేజ 144 పరుగులు, విశాల్ యాదవ్ 53 పరుగులు చేశారు. తర్వాతకు బ్యాటింగ్ చేసిన ఆదిలాబాద్ జట్టు 43.1 ఓవర్లలో 262 పరుగులకే ఆలౌటైంది. ఇందులో సుభాష్ చంద్రబోస్ 111 పరుగులు చేయగా, ఖమ్మం జట్టు 75 పరుగులతో విజయం సాధించింది. ఈ పోటీలకు ముఖ్యాతిథిగా హాజరైన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు విజేత జట్టుకు మెమొంటో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రతి జిల్లాకు సొంత క్రీడా మైదానం కొనుగోలు చేస్తామని లేదా లీజు మైదానం సమకూర్చుతామని తెలిపారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, వరంగల్ కార్యదర్శి శ్రీనివాస్, ఆదిలాబాద్ కార్యదర్శి కోదాటి ప్రదీప్, మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు జిమ్నాస్టిక్స్ క్రీడాకారుల ఎంపిక

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 9: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 12న ఉదయం 9 గంటలకు ఉమ్మడి జిల్లా జిమ్నాస్టిక్స్ అండర్- 14, అండర్-17 బాలుర, బాలికల ఎంపికలు కొల్లూరులోని ది గౌడియం స్కూల్‌లో నిర్వహిస్తామని ఎస్జీఎస్ కార్యదర్శి అమూల్యమ్మ శనివారం ప్రకటనలో తెలిపారు. జిమ్నాస్టిక్స్ ఎంపికకు హాజరయ్యే విద్యార్థులు తమ ఒరిజినల్ బోనాఫైడ్, ఆధార్ కార్డ్‌లతో సకాలంలో హాజరు కావాలని కోరారు. వివరాలకు 90006 09038లో సంప్రదించాలన్నారు.

పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలి

కోహీర్, నవంబర్ 9: కోహీర్ పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని శనివారం బీఆర్ఎస్ నాయకులు కార్యదర్శి మిస్కీన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తున్నదని, తోప్సివాడ, జహంగీర్‌వాడలో మురుగు కాల్వలు నిండిపోవడంతో దోమలు, పాములు ఎక్కువగా వస్తున్నాయని ఆరోపించారు. మూడు ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తీర్చాలని కోరారు. కార్యక్రమంలో ఫిర్దోస్, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయునదే మనగా నా క్లయింట్లు 1. శ్రీమతి ప్రభావతి తండ్రి స్వర్గీయ నరసింలు మరియు 2. శ్రీమతి రాధిక తండ్రి స్వర్గీయ నరసింలు వారు సంగారెడ్డి, ఆందోలు మండలం, అక్సాన్‌పల్లి గ్రామం వద్ద గల, 300 చ.గజాలు విస్తీర్ణం ఖాళీ ప్రదేశంతో ఇల్లు మరియు సర్వే నెం.566/ఎ7 విస్తీర్ణం ఎ.0-20 గుంటలు భూమి, సర్వే నెం.570/ఇ విస్తీర్ణం ఎక.2-21 గుంటలు మరియు సర్వే నెం.571/3/3 విస్తీర్ణం ఎక.0-17 గుంటలు భూమి, మొత్తం విస్తీర్ణం ఎక.3-18 గుంటలు వ్యవసాయ భూములకు మరియు పాత ఇంటికి ఉమ్మడి యజమానులు మరియు స్వాధీనదారులు మరియు జూనియర్ సివిల్ జడ్జ్, ఆందోల్, జోగిపేట, సంగారెడ్డి జిల్లా సమక్షంలో OS No.33/2024 లో విభజన మరియు విడి స్వాధీనత కొరకు దావా దాఖలు చేశారు మరియు అది పెండింగ్‌లో ఉంది. ఇప్పుడు శ్రీమతి సార యాదమ్మ, ఎస్.శ్రీకాంత్ మరియు శ్రీమతి చంద్రకళ @ చంద్రిక వారు సదరు దావా మరియు వాస్తవాలను మరుగుపరుస్తూ సదరు దావా పెండింగ్‌లో ఉన్నాకూడా పైన తెలిపిన సదరు ఆస్తులను అన్యాక్రాంతం చేయుటకు ప్రయత్నిస్తున్నారు. అందువల్ల సదరు ఆస్తులకు సంబంధించి దావా పెండింగ్‌లో ఉన్నందున పైన తెలిపిన సదరు ఆస్తులను కొనుగోలు చేయుటకు ఏ వ్యవహారం కుదుర్చుకోరాదని సాధారణ ప్రజలను హెచ్చరించడమైనది.

సం/- ఎమ్. శంకర్, B.Com., LL.B.,
అడ్వకేట్
ఇం.నెం.2-3-745/డి, St.అంబర్ స్కూల్ ప్రక్కన, సూపర్ ట్విన్ సిటీస్ స్కూల్ లేన్, అశోకనగర్, అంబర్‌పేట, హైదరాబాద్-500013. సెల్ నెం.9701754977